క్లుప్తంగా

ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: టిటుకుపాయి పంచాయతీ పరిధిలో పలు గ్రామాల రైతులకు మంగళవారం ఎంపీపీ బి.ఆదినారాయణ చేతులమీదుగా ఎరువులు పంపిణీ చేపట్టారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ జీరు నగేష్‌రెడ్డి, సీహెచ్‌సీ సిబ్బంది

కురుపాం: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) నేత్రవైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. నేత్రదానం చేసి అంధులకు చూపు నివ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం వైద్యాధికారి ఆశాలత మాట్లాడుతూ.. ఒకరు నేత్రదానం చేస్తే ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించొచ్చన్నారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించారు. కార్యక్రమంలో సహాయకులు శైలజ, రోజా, మల్లిక, ఐసీటీసీ కౌన్సిలర్ మోహనరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన రైతుల వివరాలు నమోదు

గరుగుబిల్లి: అర్హులైన రైతులు పీఎం కిసాన్ పథకం కోసం వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వి జయభారతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, వ్యవసాయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. 2017-18లో నమోదైన రైతులకు పీఎం కిసాన్ పథకం మంజూరు అవుతుందన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు సెప్టెంబర్ 5లోగా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్: మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల తాజా స్థితిగతులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవళిక మంగళవారం పరిశీలించారు. చినమంగళాపురం గ్రామంలో సుమారు రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన కల్వర్టుతో పాటు మరమ్మతులు చేపట్టిన రక్షిత పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచు గోగుల కళ్యాణి, ఎంపీటీసీ మజ్జి నవీన్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటుతో దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొత్స గౌరు, గ్రామస్తులు అధికారులకు రహదారులకు ఇరువైపులా మొక్కలు వేసేందుకు నిధులు సమకూర్చాలని కోరారు.

ఎంపీపీకి సత్కారం

గరుగుబిల్లి: వేతనాలు 23 శాతం పెంచడంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వెలుగు సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ వెలుగు కార్యాలయంలో ఏపీఎం పి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎంపీపీ ఉరిటి రామారావును మంగళవారం సత్కరించారు. జీతాలు పెంచి తమ జీవితాల్లో సంతోషాలు నింపిన ముఖ్యమంత్రికి తామంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన దివ్యాంగులు



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ

గరుగుబిల్లి: జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ఎనిమిది మంది దివ్యాంగులు ప్రతిభ కనబరిచినట్లు ఐఈఆర్‌టీ వై.వీర్రాజు తెలిపారు. పార్వతీపురంలోని జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో గరుగుబిల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన గౌరీశంకర్ ప్రథమ బహుమతి, 500 మీటర్ల పరుగుపందెంలో భవిత కేంద్రంలో చదువుతున్న వి.తులసి ద్వితీయ బహుమతి సాధించినట్లు చెప్పారు. డీఈఓ ప్రేమ్‌కుమార్ చేతులమీదుగా బహుమతులు అందుకున్నట్లు తెలిపారు.

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

సీతంపేట: సీజనల్ జ్వరాలు విజృంభిస్తుండడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. టైఫాయిడ్, మలేరియా వంటి కేసులతో వచ్చేవారే అధికంగా ఉన్నట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ప్రధాన వైద్యాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవసరమైన రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు.



సీతంపేట: ఐటీడీఏలో గిడుగురామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఏపీఓ రోసిరెడ్డి



వీరఘట్టం: సంప్రదాయ వస్త్రాలంకరణతో చిదిమి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు



వీరఘట్టం: తలవరం పాఠశాలలో కోలాటం ఆడుతున్న విద్యార్థులు



సీతంపేట: 'స్పోర్ట్స్ డే' ఆంగ్లలక్షరం క్రమంలో బాలికల గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవం



గుమ్మలక్ష్మీపురం: సంప్రదాయ వస్త్రాలంకరణలో కేజీబీవీ విద్యార్థినులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

తెలుగు భాషోధ్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి(తెలుగు భాషా దినోత్సవం), జాతీయ క్రీడ హాకీకి ఎనలేని గుర్తింపు తెచ్చిన క్రీడా మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి(జాతీయ క్రీడా దినోత్సవం) వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గిడుగు రమ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పటివరకు గ్రాంథికంలో ఉన్న తెలుగు భాషను వ్యవహారిక భాషగా గుర్తింపు తీసుకువచ్చేందుకు రామ్మూర్తి పంతులు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ధ్యాన్‌చంద్ తన ప్రతిభతో హాకీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చారని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు భాషోపాధ్యాయులను, వ్యాయామోపాధ్యాయులను సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



కురుపాం: గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది



పాలకొండ: తెలుగు భాష గొప్పదనాన్ని వివరిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు



కురుపాం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



జియ్యమ్మవలస: చిన్నమేరంగి జెడ్పీ హెచ్‌ఎస్‌లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



కొమరాడ: కేజీబీవీలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



గరుగుబిల్లి: కొంకడివరం పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం రవీంద్రనాథ్, తదితరులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గొండు కృష్ణమూర్తి, ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కృష్ణమూర్తి, ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగించాల్సిన అవసరం ఉందని, అది ఒక్క వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ పాలకొండ నియోజకవర్గ పరిశీలకుడు గొండు కృష్ణమూర్తి, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వండవ గ్రామంలో మంగళవారం భామిని మండల సచివాలయాల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టార్గెట్ 175 లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. పేదలకు న్యాయం జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు సచివాలయ కన్వీనర్లు కీలకపాత్ర పోషించాలని కోరారు.

గడపగడపలో అనూహ్య స్పందన..

ప్రభుత్వం చేపడుతున్న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల నుంచి విశేష మద్దతు వస్తోందన్నారు. నవరత్న పథకాల ద్వారా గ్రామాల్లోని కోట్లాది మంది నిరుపేద కుటుంబాలు లబ్ధిపొందడంతో పాటు వారి జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను, సంక్షేమాన్ని ప్రతీ గడపకు చేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

తప్పుడు ఆరోపణలు తిప్పికొట్టాలి..

ప్రజలకు మేలు చేసే ఉద్దేశ్యం లేని టీడీపీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి వివరించాల్సిన గురుతర బాధ్యత కన్వీనర్లపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్

పాలకొండ రూరల్: రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించారు. వరిపంటతో పాటు ఇతర పంటలు,ఉద్యానవన పంటల వివరాలను దరఖాస్తులో పొందుపర్చాలన్నారు. వాటితో పాటు ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, 1-బీ కాపీ జతచేయాలని సూచించారు. ఆర్‌బీకే సిబ్బంది నేరుగా పంట భూమి వద్దకు చేరుకుని రైతు వేలిముద్రతో పాటు పంట నమోదును చేపడతారని తెలిపారు.

పాలకొండ: ఈ-క్రాప్ నమోదు సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. మండలంలోని వీఆర్వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రైతులకు పంట నమోదుపై అవగాహన కల్పించాలని, వ్యవసాయశాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రతీ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. శతశాతం పంట నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి వై.వాహిని ఉన్నారు.

చేతివృత్తుల వారికి శుభవార్త

వీరఘట్టం: వచ్చే నెల 17 నుంచి ప్రారంభం కాను న్న పీఎం విశ్వకర్మ యోజనను చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బూరాడ లక్ష్మీకాంతం కోరారు. మంగళవారం వీరఘట్టంలోని ఆమె స్వగృహం వద్ద విలేకర్లతో మాట్లాడారు. వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారు లు, శిల్పకారులు తదితర చేతివృత్తులవారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ప్రతీ సచివాలయం పరిధిలో ఉన్న ఆయా వృత్తులవారంతా వలంటీర్ల ద్వారా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొండకూనేరు బీటీరోడ్డు ప్రారంభం



కొండకూనేరు బీటీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని నెల్లికిక్కువ పంచాయతీ కొండకూనేరు గిరిజన గ్రామానికి నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మంగళవారం ప్రారంభించారు. ఇంతవరకు గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేశారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.90 లక్షలతో కొమరాడ మండలం గుణద గ్రామ బీటీ రోడ్డు నుంచి కొండకూనేరు గ్రామం వరకు 1.7 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును నిర్మించారు. పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టడంపై కొండకూనేరు గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజనుల సంక్షేమానికి, గిరిజన గ్రామాల్లో సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, నిమ్మక లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, సర్పంచ్ జీలకర్ర రాములమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, టీడబ్ల్యూ ఈఈ శాంతీశ్వరరావు తదితరులున్నారు.

మండల ప్రత్యేకాధికారి సుడిగాలి పర్యటన

వీరఘట్టం: మండల ప్రత్యేకాధికారిగా నియమితులైన డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ మంగళవారం వీరఘట్టంలో సుడిగాలి పర్యటన చేశారు. ఇటీవల తొలగించిన ఓటర్ల వివరాలు పరిశీలించారు. ఎటువంటి కారణం లేకుండా, తగిన ఆధారాలు లేకుండా జాబితా నుంచి ఓటర్ల పేర్లు తొలగించరాదని బీఎల్ఓలకు సూచించారు. వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశమై ఈ-క్రాప్ నమోదుపై ఆరాతీశారు. సెప్టెంబర్ 15లోపు శతశాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. అనంతరం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమై మండలంలో చేపడుతున్న సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ కేంద్రా ల భవన నిర్మాణాలతో పాటు పాఠశాలల్లో నాడు-నేడు రెండో విడత పనుల పురోగతిపై సమీక్షించారు.

జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం

జియ్యమ్మవలస: మండలంలోని ఉపాధి వేతనదారులంతా జాబ్‌కార్డుతో ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకోవాలని ఉపాధిహామీ ఏపీఓ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రతీ వేతనదారుడు బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేసినట్లే జాబ్‌కార్డుకు కూడా ఆధార్ అనుసంధానం చేసుకుంటే వేతనాలు పడతాయన్నారు. ఆధార్ అనుసంధానం లేకపోతే వేతనాలు జమకావన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



గొటివాడ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

కురుపాం: మండలంలోని గొటివాడ, రస్తాకుంటుబాయి పంచాయతీ పరిధిలో ఆరు ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులకు యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీస్ సొసైటీ(యస్ సొసైటీ) ఆధ్వర్యంలో మంగళవారం నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. గొటివాడ సర్పంచ్ తట్టమ్మ, ఎంపీటీసీ సునీత చేతులమీదగా విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ.. కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత నేవీ ఉద్యోగి అయిన అక్కేన రవికిశోర్ పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ తులసి, మాజీ సర్పంచ్ దాలమ్మ, గ్రామ పెద్దలు ధర్మారావు, కోటేశ్వరరావు, హెచ్‌ఎం సత్యవతి పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి




రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లతో మాట్లాడుతున్న సీఎస్‌డీటీ మల్లేశ్వరరావు

వీరఘట్టం: ప్రతీ నెలా కార్డుదారులకు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సీఎస్‌డీటీ మల్లేశ్వరరావు సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తూనికల్లో ఎటువంటి తేడాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొందరు ఆపరేటర్లు రేషన్ బియ్యంకు బదులు కార్డుదారులకు డబ్బులు ఇస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ ఫిర్యాదులు నిజమని తేలితే ఎండీఎం ఆపరేటర్లను తొలగించడంతో పాటు వారిపై 6-ఏ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి


- ఎంపీపీ పద్మావతి



మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

కురుపాం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని, పథకాల అమలుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివరామప్ప ఆధ్వర్యంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను వెల్లడించారు. మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ అధ్వానంగా ఉందని, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పౌష్టికాహారం పక్కదారి పడుతోందని మండల కోఆప్షన్ సభ్యులు షేక్ జిలాని ఎంఈఓ-2 రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా అంగన్‌వాడీల ద్వారా లబ్ధిదారులకు అందాల్సిన పాలు, గుడ్లు పక్కదారి పడుతున్నాయని, దుకాణాల్లో వాటిని విక్రయిస్తున్నారని మొండెంఖల్ సర్పంచ్ గౌరీశంకరరావు, కురుపాం ఎంపీటీసీ గౌడు సంతోషిరాణి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అత్యవసర సమయాల్లో వైద్యసేవలు అందిస్తున్న 108, 104 వాహన సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గదిని కేటాయించాలని శివ్వన్నపేట ఎంపీటీసీ సభ్యుడు వెలమల బంగారునాయుడు కోరారు. వసతి గృహాల్లో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఏఎన్‌ఎంలను నియమించటంతో పాటు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు ప్రహరీలను నిర్మించాలని పలువురు సభ్యులు కోరారు. కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సివిల్ సప్లై జోనల్ మేనేజర్

గుమ్మలక్ష్మీపురం: జీసీఎంఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎంఎల్‌ఎస్ స్టాక్‌పాయింట్(గొడాం)ను సివిల్ సప్లై జోనల్ మేనేజర్ కె.సుబ్బరాజు మంగళవారం సందర్శించారు. గొడాంలో నిల్వ ఉన్న నిత్యావసర సరుకులను, రికార్డులను పరిశీలించారు. డిపోలకు, ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసిన సరుకుల వివరాలపై ఆరాతీశారు. నిర్వహణ సక్రమంగా ఉండటం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, గొడాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు ఉన్నారు.